29 మందికి కారుణ్య నియామకాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో 29 మందికి కారుణ్య నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అందజేశారు. సోమవారం కలెక్టర్ ఆఫీసులో జరిగిన ఓ కార్యక్రమంలో 16 మంది జూనియర్ అసిస్టెంట్‌లు, ఎనిమిది మంది టైపిస్ట్‌లు, ఐదుగురు ఆఫీసు సబ్ ఆర్డినేట్లు నియామక పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ భవానీ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు భద్రత కరువు

అరకొర జీతాలతో దుర్భర జీవనం
పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: మిషన్ భగీరథ విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు కష్ట కాలంగానే చెప్పవచ్చు. కార్మికులకు పూర్తిస్థాయిలో జీతభత్యాలు చెల్లించడం లేదు. కాంట్రాక్టు పద్ధతి ద్వారా వీరిని నియమించుకున్నప్పటికీ సకాలంలో జీతాలు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ప్రావిడెంట్ ఫండ్, ఆరోగ్య భీమా వంటి మాటకు చోటే లేదు. నెలవారి జీతం 9 వేలు రూపాయలు మాత్రమే అందిస్తున్నారని కార్మికులు లబోదిబోమంటున్నారు. పనివేళలు అత్యధికంగా ఉంటాయని, ఉదయం నుండి రాత్రి వరకు నిత్యం పనులు చేస్తూనే ఉండాలని, సుదీర్ఘమైన పనివేళలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గొడ్డు చాకిరీ చేస్తున్నప్పటికీ సకాలంలో ఇవ్వవలసిన జీతాలు చెల్లించకుండా అజమాయిషీ చెలాయించి ఇబ్బందులు పెడుతున్నారని వాపోతున్నారు. ఆనందపురం మండలంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు సుమారు పదిమంది విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిలో కొందరు గత 20 సంవత్సరాలుగా పనులు చేస్తున్నప్పటికీ వారికి ఇవ్వాల్సిన వేతనంలో ఎటువంటి మార్పు రాలేదని 9 వేల రూపాయలు మాత్రమే అందిస్తున్నారని పని పెరిగినప్పటికీ జీతంలో మార్పు అయితే రాలేదని ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కాంట్రాక్టర్లు ఆలస్యంగా చెల్లిస్తున్నారని వాపోతున్నారు. దీనివల్ల జీతాలు తమకి సరిగా అందడం లేదని ఈ సమస్యను పరిష్కరించాలని బోని గ్రామానికి చెందిన బోని సత్యనారాయణ, పోతల అప్పారావు కోరుతున్నారు. 2002వ సంవత్సరంలో మిషన్ భగీరథలో మొదటి నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులు, సగటు మహిళ రోజువారి కూలి 600 రూపాయలు, మహిళలకు ఇస్తున్న కనీస వేతనం ఇవ్వడం లేదని అటువంటిది నిత్యం పనులు చేస్తున్నప్పటికీ జీతం మాత్రం పెరగడం లేదని చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని కుటుంబం నిత్యావసరాలను దృష్టిలో పెట్టుకొని వేతనం పెంచాలని, అలాగే పిఎఫ్, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

చిరు వ్యాపారులకు న్యాయం జరిగేలా చూడాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు వినతి పత్రం సమర్పించిన బాధితులు

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ నగరంలో చిరువ్యాపారుల పొట్ట కొట్టిన జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు వేధింపుల నుంచి కాపాడాలని కోరుతూ వేపగుంట శ్రీముత్యమాంబ వ్యాపార సంఘ సభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్‌కు విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. హాకర్ జోన్ ఏర్పాటు చేసేంతవరకు యధావిధిగా వ్యాపారాలు కొనసాగించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సిపిఐ అగ్రనేతలు, సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే.వి.సత్యనారాయణ మూర్తికి సూచించారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో 93,94 వార్డు కమిటీల నాయకులు వ్యాపారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు ఏఐటీయూసీ కార్యదర్శి వై రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఆర్థిక అక్షరాస్యత పెరగాలి

విశాలాంధ్ర - మధురవాడ: దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ప్రజలలో ఆర్థిక అక్షరాశ్యత పెరగాలని సెబి నిపుణుడు చల్లా దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవం (వరల్డ్ ఇన్‌వెస్టర్స్ వీక్) సందర్భంగా డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎకౌంటింగ్ మరియు ఫైనాన్స్ విభాగంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్థిక మార్కెట్‌లలో పారదర్శకతకు, పెట్టుబడిదారుల భద్రతకు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఇ) తీసుకుంటున్న చర్యలును ఆయన వివరించారు. మేనేజ్‌మెంట్ కోర్సులను అభ్యసించే వారు ఫైనాన్సియల్ లిటరసి, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహనతో పాటు మార్కెట్‌ల ఒడిదుడుకులను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. సెక్యూరిటీస్ మార్కెట్‌లలో వివాదాల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు. పెట్టుబడుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్థిక అంశాలపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ తరుపున బహుమతులను, సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎకౌంటింగ్ మరియు ఫైనాన్స్ విభాగం అధిపతి డాక్టర్ జి.వి.కె. కస్తూరి అధ్యక్షత వహించారు.

విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

హాజరైన కేంద్ర పోర్టులు నౌక, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: కేంద్ర పోర్టులు నౌక, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. అనంతరం సాగర్మాలా కన్వెన్షన్స్, సాలిగ్రాంపురం వద్ద జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈస్ట్ క్వే -1ఎ టెర్మినల్ ఆపరేషన్ మెయింటెనెన్స్ ప్రాజెక్ట్‌ను గ్రీన్ ఎనర్జీ రిసోర్సెస్, విశాఖపట్నంకు రూ.130 కోట్ల వ్యయంతో అప్పగించారు. ఈ ప్రాజెక్ట్‌లో 120 టన్నుల సామర్థ్యం గల రెండు హార్బర్ మొబైల్ క్రేన్లు అనుబంధ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంవత్సరానికి 3 మిలియన్ మెట్రిక్ టన్నుల అదనపు సామర్థ్యం పెరుగుతుందని, దాదాపు 150 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు, పోర్ట్ యొక్క లాజిస్టిక్స్ వ్యయాలు తగ్గి, విశాఖపట్నం తూర్పు తీరంలోని ప్రధాన కార్గో హబ్‌గా మరింత బలోపేతం కానుందన్నారు. స్మార్ట్ వీడియో సర్వైలెన్స్ ప్రాజెక్ట్, దీని వ్యయం రూ.37.53 కోట్లు అని, ఈ ప్రాజెక్ట్‌ను రైల్టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, హైదరాబాద్ సంస్థ చేపట్టిందన్నారు. ఇందులో ఏఐ ఆధారిత వీడియో విశ్లేషణ సాంకేతికతలు, అలాగే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయబడతాయన్నారు. 12 నెలల్లో పూర్తికానున్న ఈ ప్రాజెక్ట్ పోర్ట్ భద్రత, ఆపరేషనల్ సామర్థ్యం, పర్యవేక్షణ సామర్థ్యాలను పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు శ్రీ భరత్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు, పోర్టు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీపీఏ సెక్రటరీ టి.వేణుగోపాల్ ఈ సమాచారాన్ని మీడియాకు విడుదల చేశారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలలో భాగంగా నిత్యవసర వస్తువులపై ప్రత్యేక మినహాయింపులు ద్వారా పేద ప్రజలకు లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. ఈ మేరకు పారిశ్రామిక ప్రాంతం పరిధి 59, 60 వార్డుల్లో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలసలో దేవతా విగ్రహాల ప్రతిష్ట

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలసలో గణపతి, పార్వతి అరుణాచలేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాల ప్రతిష్ట సోమవారం ఘనంగా జరిగింది. గురుస్వామి దివంగత ఆకెళ్ళ నర్సింహమూర్తి (బుచ్చి పంతులు) కుమారులు ఆకెళ్ళ ఫణిరామ్ భాగ్యరాజ్ శర్మ, రవి గణేష్ శర్మలు తమ స్వగృహంలో (జ్యూట్ రామాలయం పక్కన) నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో బ్రహ్మశ్రీ మహేంద్రాడ రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో 11 మంది వేదపండితులచే దేవాలయం విగ్రహాల ప్రతిష్ట జరిపారు. అలాగే సద్గురు శివ కేశవ భజన సమాజం (చీరాల) వారిచే భజన కార్యక్రమం జరిగింది. సుమారు 8 వేల మందికి భారీ అన్నసమారాదన చేపట్టారు. సాయంత్రం అయ్యప్ప దేవాలయం లో మవుడూరి యోగేశ్వరశర్మ (తంత్రి, గురుస్వామి) వారిచే అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయండి

- వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఈనెల 9వ తేదీన వై.యస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న నర్సీపట్నం పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు పిలుపునిచ్చారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి తలమానికం అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. నగరంలో చిన్న చిన్న షాపులు పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్న ఎంతోమంది పేదవారి జీవనాధారం అయినటువంటి బడ్డీలను, షాపులను తొలగించి వారికి భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి వైద్యం, విద్య అందుబాటులో ఉండాలని సంకల్పించి నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఈ రాష్ట్రానికి తీసుకొచ్చి నిర్మాణాలు చేస్తుంటే ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పీపీపీ ద్వారా ప్రైవేటుపరం చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 9వ తేదీన ఉదయం 9:00 గంటలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి విశాఖ విమానాశ్రయానికి చేరుకొని అక్కడ నుండి రోడ్డు మార్గం ద్వారా నర్సీపట్నం చేరుకుంటారన్నారు. అక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలిస్తారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, సమన్వయకర్తలు మళ్ళ విజయ ప్రసాద్, వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట రామయ్య, అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకులు, డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డును దక్కించుకున్న జివిఎంసి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 2025 స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విజయవాడలో అందుకోవడం జరిగిందని సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ నగర మేయర్, జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ 2025 స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో భాగంగా స్పెషల్ కేటగిరి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు గా స్వచ్ఛ మున్సిపాలిటీల కేటగిరీలో విశాఖ నగరపాలక సంస్థకు రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు దక్కిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయ సాధన దిశగా ప్రారంభమైన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రూపకల్పన దిశగా మరింత ముందుకు తీసుకువెళ్లి విశాఖ నగరాన్ని ఉత్తమ పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను రూపొందిస్తామని వారు తెలిపారు.

సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ అనుమతులు రద్దు చేయాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: అంబుజా గంగవరం సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ అనుమతులు రద్దు చేయాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి డిమాండ్ చేశారు. అంబుజా గంగవరం సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు వినతి అందజేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అనువుకాని చోట నిర్మిస్తున్న ఈ ఫ్యాక్టరీ ఏర్పాటును అంగీకరించకూడదని, వెంటనే రిపోర్టులను పరిశీలించి తక్షణమే ఫ్యాక్టరీ పెట్టుకున్న అప్లికేషన్‌ను తిరస్కరించాలని కోరారు. దీనిపై ప్రభుత్వం కూడా పునరాలోచన చేసి ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని, లేకపోతే అక్కడి ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీకి డబుల్ బెనిఫిట్స్

విశాలాంధ్ర - పెందుర్తి: డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీకి డబుల్ బెనిఫిట్స్ చేకూరుతున్నాయని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు ముమ్మన దేముడు పేర్కొన్నారు. జీవీఎంసీ 95వ వార్డు వేపగుంట రామాలయం కమిటీ హాల్‌లో సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం సిట ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ముమ్మన దేముడు జీఎస్టీ 2.0, జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గురించి డ్వాక్రా మహిళకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలతో ధరలు తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించిందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి జీఎస్టీ ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బిజెపి 95, 97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, కూటమి నాయకులు గంట్ల దేముడు, గంట్ల నర్సింహామూర్తి, కొత్తపల్లి అప్పలరాజు, ఆర్.పీ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ దిగ్గజాలు మిథాలీ రాజ్, రావి కల్పనలకు అరుదైన గౌరవం

స్టేడియంలోని స్టాండ్‌కు, గేట్‌కు మహిళా క్రికెటర్ల పేర్లు

విశాలాంధ్ర - పీఎం పాలెం: ఇండియా -ఆస్ట్రేలియా మ్యాచ్‌లో మహిళా క్రికెటర్లు దిగ్గజాలు మిథాలీ రాజ్, రావి కల్పనలకు అరుదైన గౌరవం లభించనుంది. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 12న విశాఖపట్నంలోని వీడీసీఏ స్టేడియంలో జరగబోయే భారత్-ఆస్ట్రేలియా మహిళల ప్రపంచకప్ మ్యాచ్ సందర్భంగా మహిళా క్రికెట్ దిగ్గజాలు మిథాలీ రాజ్, రావి కల్పన ఘన సత్కారం అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా స్టేడియంలోని ఒక స్టాండ్‌కు మిథాలీ రాజ్ పేరు, ఒక గేటుకు రావి కల్పన పేరు ఇవ్వనున్నట్లు ఏసీఏ ప్రకటించింది. మహిళల క్రికెట్ అభివృద్ధికి వారు చేసిన కృషి, సాధించిన విజయాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ చొరవను అభినందిస్తూ మహిళా క్రికెటర్లకు లభిస్తున్న ఈ గుర్తింపు రాష్ట్రం క్రీడల్లో సమ్మిళితత్వం, ప్రతిభకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. క్రీడా రంగంలో సదుపాయాలు, శిక్షణ మార్గాలు, గుర్తింపు అవకాశాలను పెంపొందించడంలో నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ కూడా ఈ దిశగా శక్తివంతమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని సంస్థ పేర్కొంది. ఏసీఏ తీసుకున్న ఈ నిర్ణయం, భారత మహిళా క్రికెట్‌కు మిథాలీ రాజ్, రావి కల్పన అందించిన సేవలను మాత్రమే కాకుండా, రాబోయే తరాల యువ క్రీడాకారిణులకు పెద్ద కలలు కనాలని ప్రేరేపించే ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోనుంది.

డీఎస్సీలో మెరిట్ ర్యాంకర్లను రిజర్వేషన్లో లెక్కించడం రాజ్యాంగ విరుద్ధం

రోస్టర్ అమలులో సుప్రీంకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకోవాలి
విదసం డిమాండ్

విశాలాంధ్ర - మధురవాడ: మెగా డీఎస్సీ నియామకాల్లో మెరిట్ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను రిజర్వేషన్ కేటగిరీకి దించి రిజర్వేషన్ సీట్లలో కోత విధించడం రాజ్యాంగ విరుద్ధమని మెరిట్ సాధించిన వారిని ఓపెన్ కేటగిరీలోనే లెక్కించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. డీఎస్సీలో మెరిట్ సాధించిన వారిని రిజర్వేషన్‌లో పెట్టడం వల్ల రిజర్వేషన్ పోస్టులు తగ్గిపోయి ర్యాంకులు పొందిన వందల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అర్హత కోల్పోయారని ఈ తప్పిదాలు సరిదిద్ది న్యాయం చేయాలని విదసం ఆధ్వర్యంలో విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బూసి మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ అమలుకోసం 2023 జీవో 77 రూల్స్ ప్రకారం నియామకం ఉంటుందని చెప్పిన ప్రభుత్వం ఆ జీవోలో పొందుపరచిన 2వ క్లాజు విస్మరించిదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వారు ఎవరైనా కటా ఫ్ మార్కులు దాటి మెరిట్ సాధిస్తే వారిని రిజర్వేషన్ కోటాలో లెక్కించ కూడదని స్పష్టంగా ఉన్నప్పటికీ మెరిట్ ర్యాంకులు పొందిన అనేక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలను రిజర్వేషన్‌లో లెక్కించి సుప్రీంకోర్టు తీర్పును సైతం ఉల్లంఘించారని విమర్శించారు. బూల భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లా నుండి నష్టపోయిన అభ్యర్థులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కాకినాడ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నారు. ఆలయ పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు దంపతులకు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేములవలస పంచాయతీకి స్వచ్ఛంద అవార్డు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డులో భాగంగా ఇటీవలే ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులో మూడవ స్థానం లభించింది. అందులో భాగంగా విశాఖలో నిర్వహించిన అవార్డులో భాగంగా సర్పంచ్ లంక కొండమ్మకు జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్ చేతుల మీదగా అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, స్వచ్ఛ ఆంధ్రడైరెక్టర్ నాగలక్ష్మి, వేములవలసపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషి వల్లే అవార్డులు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్వర్ణాంధ్ర సాధించాలంటే ముందు స్వచ్ఛాంధ్ర సాధించాలని,అందరి కృషిని,కష్టాన్ని గుర్తించి అవార్డులు ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం వి.ఎం.ఆర్.డి.ఎ. చిల్డ్రన్ ఏరీనాలో అట్టహాసంగా స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమం ద్వారా ముందుకు వెళ్తున్నామన్నారు. 15 శాతం వృద్ధి సాధించే దిశగా పయనిద్దామని, పరిసరాల పరిశుభ్రత ద్వారా ఖర్చు తగ్గించాలన్నారు. కాలుష్యం వల్ల చాలా అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. జిల్లా స్థాయి 45 అవార్డులు, ఏడు రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయని, రాష్ట్ర స్థాయి అవార్డులలో విశాఖపట్నం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాగలక్ష్మి, రాము, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు, జీవీఎంసీ అధికారులు, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

రెడ్డి కంచరపాలెంలో దొంగలు బీభత్సం

వృద్ధురాల్ని తాళ్లతో కట్టేసి, ఆమె మనవడిపై దాడిచేసి బంగారం పట్టుకుపోయిన దుండగులు
రూ.3లక్షల నగదుతోపాటు బాధితుల కారులోనే దర్జాగా పరారీ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖపట్నంలోని రెడ్డి కంచరపాలెంలో దొంగలు బీభత్సం సృష్టించారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఇంట్లోకి దుండగులు చొరబడి 12 తులాల బంగారం, రూ.3లక్షల నగదు, కారుతో పరారయ్యారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న వృద్ధురాలు, ఆమె మనవడి కాళ్ళు, చేతులు కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దొంగలు తీసుకెళ్లిన కారును మారికవలస వద్ద గుర్తించారు. దుండగల ఆచూకీ కోసం చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగిన ఈ సంఘటన నగరంలో తీవ్ర భయాందోళన కలిగించింది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ఎల్లాయమ్మ (73) అనే వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డారు. ఆమె, తన మనవడు కృష్ణ కార్తీక్ (18) కింద గదిలో నిద్రపోగా పైగదిలో మిగతా కుటుంబ సభ్యులు పడుకున్నారు. రాత్రి 1గంట సమయంలో జరిగిన ఈ సంఘటనలో వృద్ధురాల్ని తాళ్లతో కట్టేసి ఆరు బంగారు గాజులతో పాటు రెండు తులాల చైన్ లాక్కుపోయారు. అడ్డుకున్న ఆమె మనవడు కార్తీక్‌ను తీవ్రంగా కొట్టి బంగారం ఉంగరం దోచేశారు. బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదుతో పాటు, బీరువాపై ఉన్న కారు తాళం తీసుకుని బయట పార్క్ చేసి ఉన్న బాధితుల కారులోనే దుండగులు పరారై పోయారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా కంచరపాలెం నేర విభాగ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీస్ జాగిలాలతో దుండగుల ఆచూకీని కనిపెట్టే పనిలో ఉన్నారు. నగరం నడిబొడ్డునే ఇలాంటి దోపిడీలు జరిగితే నగర శివారు ప్రాంతాల్లో దొంగల భయం బాబాయ్ అంటూ నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - తగరపువలస: తమకు రెండు నెలలుగా బకాయి పడిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భీమిలి జోనల్ కార్యాలయం ఎదుట క్లాప్ వాహన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జోన్ కమిటీ సహాయ కార్యదర్శి రవ్వ నరసింగరావు మాట్లాడుతూ ఒకటో జోన్ పరిధిలో ఇంటింటికీ చెత్తను సేకరించే 21 క్లాప్ వాహనాలకు 21 మంది కార్మికులుగా పని చేస్తున్నారని అన్నారు. రెండు నెలలుగా వేతనాలు అందక సంబంధిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నెలకు ఇస్తామన్న రూ 15 వేలు వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పి శివ కుమార్, ఎస్ పోతురాజు, ఎన్ రమణ, ఆదినారాయణ, ఎన్ అప్పలరాజు తది తరులు పాల్గొన్నారు. అనంతరం జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడుకు వినతి పత్రం అందజేశారు.

ప్రజా సమస్యలే పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్" లో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, అర్జీల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత నివ్వడంతో పాటు అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు.... జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జి వి ఎమ్ సి సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి వినతులు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 248 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 86 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 16, జీవీఎంసీ సంబంధించి 66 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 80 వినతులు అందాయి.

కొవ్వాడ గ్రామ సభలో గందరగోళం

ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్న తహసిల్దార్ ఆనందరావు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కొవ్వాడ పంచాయతీలో సోమవారం స్థానిక గ్రామంలోని రామాలయం వద్ద గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సభ ప్రారంభానికి ముందు ల్యాండ్ పూలింగ్ చేయదలచిన సర్వేనెంబర్ 237కు సంబంధించిన కొంతమంది రైతులు నిరసన బ్యానర్ పట్టుకుని ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ సర్వేలో మాకు అన్యాయం జరిగిందని కొంతమంది రైతులు ఆరోపించారు. భూమిపై అనుభవంలో ఉన్న రైతులు కాకుండా కొంతమంది బినామీలను తయారుచేసి వారిని రైతులుగా నమ్మించి రీ సర్వేలో వాళ్ళ పేర్లను నమోదు చేయడం అదే భూమిని నమ్ముకుని బతుకుతున్న అసలైన రైతులకు న్యాయం జరగలేదని వారు వాపోయారు. సర్వేయర్ విఆర్‌ఓ పై వారికి పలు అనుమానాలు ఉన్నాయని మరలా రీ సర్వే జరిపించి మాకు న్యాయం చేయాలని బాధిత రైతులు మీడియా ముఖంగా విన్నవించుకున్నారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కాకరా ఆనందరావు గ్రామసభను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను అన్నిటిని క్షుణ్ణంగా తహసిల్దార్‌కు వివరించడం జరిగింది. బినామీ పేర్లతో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట వేసి అసలైన రైతులను గుర్తించి మాకు తగిన న్యాయం చేయాలని తహసిల్దార్ కు రైతులు విన్నవించుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఆనందరావు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ కొరకు కొవ్వాడ రైతులతో కంటకాపల్లి రైతులతో గతంలో గ్రామసభలు నిర్వహించామని అయినప్పటికీ రైతులు సంతృప్తి చెందలేనందున మరల ఎవరికైతే వారి భూమి కొలతలపై అనుమానాలు ఉన్నాయో మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి నేరుగా వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చునని అన్నారు. కొవ్వాడ గ్రామంలో సర్వేనెంబర్ 237లో సుమారు 230 ఎకరాలు గుర్తించామని అందులో 150 ఎకరాలు రైతులు అనుభవంలో ఉన్నదని అన్నారు. 13 ఎకరాలు 31 మంది రైతులుకు అసైన్మెంట్ చేయబడిందని అన్నారు. మిగిలిన 137 ఎకరాలలో 222 మంది అనుభవంలో ఉన్న రైతులగా గుర్తించామని మొత్తంగా 253 మంది రైతులు ఉన్నట్లు తెలియజేశారు. వారు వివరాలను సాగు విస్తీర్ణాన్ని తెలియజేస్తామని అభ్యంతరాలు ఉన్న రైతులు తమకు నేరుగా తెలియజేయాలని అన్నారు. అభ్యంతరాలు ఉన్న రైతులు సమక్షంలోనే వారి భూములను సర్వే చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ల్యాండ్ పూలింగ్లో దళారులను మధ్యవర్తులను నమ్మవద్దని, బినామీలకు ఎటువంటి అవకాశం ఇవ్వమని ప్రతి రైతుకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసరావు, స్థానిక వీఆర్వో సర్వేయర్ వీఆర్‌ఏ తదితరులు పాల్గొన్నారు.

వైసిపినీ మళ్లీ అధికారంలో తీసుకురావడమే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గత వైసీపీ సర్కార్ హయంలో జగన్మోహన్ రెడ్డి నెలకొల్పిన 17 మెడికల్ కాలేజీల స్థాపన చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. ఆసీలమెట్ట దక్షిణ వైయస్సార్సీపి కార్యాలయంలో సోమవారం ఉదయం దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి సమన్వయ కమిటీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఈ కాలేజీల ప్రైవేటీకరణ, పి పి పి విధానం చంద్రబాబు స్కామ్‌లో ఇదొక నాటకమన్నారు. కాగా, స్పీకర్ అయ్యన్న పాత్రుడు నర్సీపట్నం మాకవర పాలెంలోని మెడికల్ కాలేజీకి జీవో లేదని చెప్పడం అవివేకం అని మండి పడ్డారు. ఈ నెల 9వ తేదీన మాజీ సి ఎం జగన్ అక్కడికి వచ్చినపుడు ఈ జీవో చూపించి స్పీకర్ కళ్ళు తెరిపిస్తామని అన్నారు. ఆపరేషన్ లంగ్స్ పేరుతో విశాఖలో 42 వేల మంది చిరు వ్యాపారులు కడుపు కొట్టారన్నారు. అమరావతి కోసం విశాఖను చంద్ర బాబు పణంగా పెడుతున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్ర ప్రాంతం మీద సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని వాసుపల్లి విమర్శించారు. విశాఖ సంపదను అమరావతికి తీసుకుపోతున్నారని ఆరోపించారు. దక్షిణ నియోజకవర్గంలో త్వరితగతిన బూత్ కమిటీలు వేయాలని నేతలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో . వాసుపల్లి తో పాటు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అదానీ అంబూజా సిమెంట్ నిర్మాణ అనుమతులు ఇవ్వొద్దు

జీవీఎంసీలో తీర్మానం చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పెదగంట్యాడ వద్ద అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేయుటకు వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మేయర్ పీలా శ్రీనివాస్‌కు లేఖ రాశారు. మహా విశాఖ పట్నం నగర పాలక సంస్థ(జీవీఎంసీ) పరిధిలో గాజువాకలోని పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య 40 లక్షల సామర్థ్యంతో అదానీ సంస్థ అంబుజా సిమెంట్ కంపెనీని నిర్మాణం చేయుటకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని, 2025 అక్టోబర్ 8న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ఆంధ్ర రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందని, ఈ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం ప్రాంతాలు మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విష కణాలతో నిండిపోతుందన్నారు. తక్షణమే ఎటువంటి జాప్యం లేకుండా జీవిఎంసీ కౌన్సిల్ ను సమావేశపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆ సమావేశంలో ప్రతిపాదిత అదానీ సిమెంట్ కంపెనీని వ్యతిరేకిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసి, రాష్ట్ర ప్రభుత్వం అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా , సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనలు రద్దు చేయాలని కోరారు. నగర ప్రథమ పౌరుడిగా మేయర్ అక్టోబర్ 8 న జరగబోచున్న ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని జీవీఎంసీ లోని 25 లక్షల తరుపున అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరుతున్నానని తెలిపారు.

తమ భూములను కాపాడుకుంటాం

విశాలాంధ్ర - ఆనందపురం: ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఆ ప్రాంతంలోని దళిత రైతులకు సుమారు 102 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున కేటాయించడం జరిగింది. అప్పటి నుంచి కొంతమంది రైతులు ఆ భూమిలో సాగుచేసుకుంటూ పంటలు పండించగా, మరికొందరు జీడితోటలు వేసుకుని జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆ భూములను గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం కోసం కేటాయించినట్లు సమాచారం వెలువడటంతో స్థానిక రైతుల్లో ఆగ్రహం నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. మండల తహసిల్దార్ శీను బాబు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు. సభలో ఆర్డీవో రైతులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం వివరాలు తెలియజేయగా, రైతులు మాత్రం "మా భూమి మాకు కావాలి, నష్టపరిహారం వద్దు" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. "మా ప్రాణాలు అర్పించినా మా భూమిని వదులుకోము" అంటూ గట్టిగా నినదించారు. ఈ సందర్భంలో సభలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆర్డీవో సంగీత్ మాథుర్ రైతులను సమాధానపరచి, మాట్లాడుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతులు సమావేశం అనంతరం కూడా నినాదాలు చేస్తూ భూములను కాపాడాలనే సంకల్పంతో ఆందోళన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సరైన వైద్యాన్ని అందించాలి

- హోం మినిస్టర్ అనితకు వినతి పత్రాన్ని అందజేసిన పిడిఎస్ఓ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పచ్చకామర్ల బారిన పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులను పిడిఎస్ఓ జిల్లా కమిటీ సోమవారం పరామర్శించింది. కేజీహెచ్‌లో హోమ్ మినిస్టర్ వంగలపూడి అనితను కలిసి విద్యార్థులకు సరైన వైద్యం అందించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుమారు 129 మంది విద్యార్థినులు పచ్చకామెర్ల బారిన పడి ఇప్పటికే ఇద్దరు మరణించగా మిగతా విద్యార్థినులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 600 మందికి పైగా విద్యార్థినులు ఉన్న పాఠశాలలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండటం కారణంగానే విద్యార్థులకు ఈ దుస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. సరైన తాగునీరు లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని వైద్యవర్గాలు తెలుపుతున్నాయన్నారు. వందల మంది విద్యార్థులు ఉన్నచోట సరైన తాగునీటి సదుపాయం కూడా లేకపోవడం మన ప్రభుత్వాల వైఫల్యానికి ఒక నిదర్శనం అని మండిపడ్డారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పిడిఎస్ఓ డిమాండ్ చేస్తుందన్నారు.

కాలువలో వృద్ధుడు అనుమానస్పద మృతి

విశాలాంధ్ర - పీఎం పాలెం: పీఎం పాలెం రామాలయం పక్కన మురుగు కాలువలో పడి అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. మృతుడు మువ్వల ప్రసాద్ (61)గా పోలీసులు గుర్తించారు. స్థానికంగా సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. పీఎంపాలెం ఎల్ఐజిలో నివాసంలో నివాసం ఉంటున్న ఈయన అనుమానాస్పద మృతి కేసు పిఎం పాలెం పోలీసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: అతివేగంతో డివైడర్ ఢీకొట్టిన ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఆ విద్యార్థి మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై విలపించారు. ఇటీవల దసరాకు తమ కుమారుడు కోసం మూడు లక్షలు ఖరీదైన బైకు కొనిచ్చిన తల్లిదండ్రులకు తీవ్ర విషాదాన్నే మిగిల్చింది. అర్ధరాత్రి సిరిపురం వద్ద ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖపట్నంలో నిర్వహించిన ఫుడ్ బాల్ గేమ్స్‌లో అండర్ 14 ,17కు ఆనందపురం మండలం తర్లువాడ హై స్కూల్ కి చెందిన విద్యార్థులు మజ్జి నవ్య శ్రీ, గంటా కీర్తన,కోరాడ ఉష, మజ్జి ఆదర్శ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్బాల్ క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరావు, ఎస్ఎంసి చైర్మన్ మజ్జి రాంబాబు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

జగన్ అనకాపల్లి పర్యటన విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ఈ నెల 9 న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై యస్ జగన్ మోహన్ రెడ్డి, అనకాపల్లి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, ఉత్తరాంధ్ర జోన్ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ పార్టీ నాయకులు, ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాంపురం కార్యాలయంలో సబ్బవరం మండలం, జీవిఎంసీ 88వ వార్డు వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించి, జగన్ పర్యటన గురించి వివరించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలపడంలో భాగంగా, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శనకు వస్తున్న జగన్ మోహన్ రెడ్డికి లంకెలపాలెం కూడలిలో ఘన స్వాగతం పలుకుతామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గండి రవికుమార్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కోటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్,మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు,88వ వార్డు అధ్యక్షులు గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు తదితరులు ఉన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సోమవారం మాస్టర్ ప్లాన్ -2041 పై సమీక్ష జరిగింది. ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ లు మాస్టర్ ప్లాన్ పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ గత పాలకుల హయంలో మాస్టర్ ప్లాన్ లో జరిగిన తప్పిదాలపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె. రమేశ్, కార్యదర్శి మురళీ కృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప పాల్గొన్నారు.

నిర్దేశించిన గడువులోగా వినతులు పరిష్కరించాలి

వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ ప్రజా దర్బార్ కి వచ్చిన వినతులను నిశితంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఛైర్మన్ ఎం. వి. ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సోమవారం ఉదయం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా దర్బార్ ఆయన పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రజా దర్బార్ కి మొత్తం 9 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె రమేశ్, కార్యదర్శి మురళీ కృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఈ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ బ్లాక్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ కి భూమిపూజ

విశాలాంధ్ర - విశాఖపట్నం: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ ఎస్ ఈ) తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ)తో భాగస్వామ్యం చేసుకొని, నవీ ముంబైలో మల్టీస్పెషాలిటీ బ్లాక్, 60 పడకల బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బీ ఎం టీ) సెంటర్‌తో కూడిన అద్భుతమైన జీ ప్లస్ 11 అంతస్తుల క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించింది. దేశంలోనే అతిపెద్దదిగా, అలాగే దక్షిణాసియా ప్రాంతంలో అతిపెద్ద సదుపాయంగా నిలిచే ఈ ఆధునిక హాస్పిటల్, సంవత్సరానికి సుమారు 1.3 లక్షల అవుట్‌పేషెంట్ రోగులకు చికిత్స అందించడంతో పాటు, 600కుపైగా ప్రాణాలను రక్షించే బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ విధానాలను నిర్వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. 2.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడుతున్న ఈ ప్రాజెక్ట్ పూర్తి కావడానికి సుమారు ?380 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. లార్సెన్ %ఊ% టూబ్రో (ఎల్ అండ్ టీ) ఈ పీ సీ మోడ్‌లో నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, ఈ హాస్పిటల్ జూలై 2027 నాటికి కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది.

ఇస్త్రీ ప్రాజెక్ట్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వీధి విక్రేతలకు ఉద్యమ్ వ్యాపార్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఉద్యమ్ వ్యాపార్ ఒక ముఖ్యమైన కీలకమైన మైలురాయిని దాటిందని, ది ఇస్త్రీ ప్రాజెక్ట్ ద్వారా, భారతదేశంలో ఉన్న ఇస్త్రీ విక్రేతలు సెప్టెంబర్ 2025 నాటికి రూ. 100 కోట్ల ఆదాయాన్ని సముపార్జించేలా ఉద్యమ్ వ్యాపార్ చేసిందని, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు కృష్ణన్ రంగనాథన్ తెలిపారు.

ఉద్యమ్ ఇస్త్రీ ప్రాజెక్టులో భాగంగా వినియోగదారుల అవసరాల కోసం వీధుల్లో ఇస్త్రీ చేసే వారికి సబ్సిడీ ధరలకు బొగ్గు మరియు ఎల్పీజీ ఆధారిత ఇస్త్రీ పెట్టెలను అందిస్తోందన్నారు. ఈ ఇస్త్రీ ప్రాజెక్ట్‌కు సహాయపడటం ద్వారా పురాతన ఇస్త్రీ పరిశ్రమను మార్చేందుకు నడుం బిగించింది. దీనివల్ల, ఇస్త్రీ విక్రేతలు ఇంధన ఖర్చులను దాదాపు సగానికి తగ్గించుకోగలుగుతారన్నారు. సరైన మద్దతు అందించినప్పుడు వారు జనాభాలో ఎక్కువ భాగం జీవితాలను మెరుగుపరచగలరన్నారు. ది ఇస్త్రీ ప్రాజెక్ట్‌తో రూ.100 కోట్ల మైలురాయిని దాటడం తమకు మాత్రమే కాదు, మార్పును స్వీకరించడానికి ఎంచుకున్న వేలాది మంది ఇస్త్రీ విక్రేతలకు గర్వకారణం అన్నారు. ఇస్త్రీ ప్రాజెక్ట్ ప్రోగ్రామ్ హెడ్ సిరిల్ జోసెఫ్ ఉద్యమ్ వ్యాపార్ గురించి మాట్లాడుతూ "ఈ మైలురాయి మమ్మల్ని విశ్వసించి, బొగ్గు నుండి ఎల్ పీ జీ కి మారిన వారు ఏమి సాధించవచ్చో చూపించిందన్నారు.

విశాఖకు రేడియంట్ డైమండ్ అనుభవాన్ని తీసుకువస్తున్న జోస్ అలుక్కాస్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో నాణ్యత, ఆవిష్కరణ మరియు ఆధునిక ఆభరణాల విషయంలో విశ్వసనీయత గల జోస్ అలుక్కాస్, అక్టోబర్ 4 నుండి 26 వరకు విశాఖపట్నంలోని అసిల్మెట్టలోని సంపత్ వినాయక ఆలయంలో ప్రపంచ స్థాయి వజ్రాల ప్రదర్శన 'సిగ్నేచర్ జ్యూవెల్లరీ షో' ను ఆహ్వానిస్తున్నారు. జోస్ అలుక్కాస్ సిగ్నేచర్ జ్యూవెల్లరీ షోలో, ప్రత్యేక సమకాలీన డిజైన్లలో సహజ వజ్రాల అద్భుతమైన సేకరణను ప్రదర్శించబడుతుంది.

ఈ ప్రదర్శనలో వజ్ర ఆభరణాలలో సరికొత్త ఆవిష్కరణలు హైలైట్ చేయబడ్డాయి. చక్కగా రూపకల్పన చేసిన నెక్లెస్లు, స్టాండ్-అవుట్ చెవిపోగులు, ప్రత్యేకమైన పెళ్లి బృందాలు. మొట్టమొదటిసారిగా, ప్రత్యేక కళాత్మక నమూనాలు ప్రదర్శన కోసం ఉంచబడ్డాయి మరియు కొలెక్టర్‌లు మరియు ఆభరణాల ఔత్సాహికుల కోసం అందుబాటులో ఉన్నాయి. వ్యక్తిగతీకరణ సేవలు కూడా అందించబడతాయి, ప్రతి భాగాన్ని వ్యక్తిగత అభిరుచులు మరియు శైలి ప్రాధాన్యతలకు అనుగుణంగా అనుకూలీకరించడానికి అవకాశం కల్పిస్తుందని మిస్టర్. జాన్ అలుక్కాస్, మేనేజింగ్ డైరెక్టర్, జోస్ అలుక్కాస్‌అన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ రాహిత్యాన్ని సిప్‌తో అధిగమించండి

- ఎస్బీఐ ఎంఎఫ్ అవగాహన సదస్సులో వక్తలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆర్థిక అలసత్వాన్ని, క్రమశిక్షణారహిత్యాన్ని అధిగమిస్తూ ఆర్థిక క్రమశిక్షణతో శక్తిమంతమైన ఎస్ ఐ పీ (క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి ప్రణాళిక) తో ముందుకు సాగాల్సిందిగా ఆర్థిక రంగానికి చెందిన పలువురు నిపుణులు వ్యాఖ్యానించారు. ఎస్బిఐ మ్యూచువల్ ఫండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెట్టుబడుల అవగాహన సదస్సు లో వారు మాట్లాడుతూ స్థిరత్వం, క్రమశిక్షణతో ఎస్ఐపి చేయాలన్నారు. వాయిదాలు వేయడం, అత్యవసర నిధి లేకపోవడం, ఆవేశపూరిత ఖర్చులు, బడ్జెటింగ్ లేకపోవడం , అప్పుల ఊబి, స్వల్పకాలిక ఆలోచన, ద్రవ్యోల్బణాన్ని పట్టించుకోకపోవడం, పన్నుల చికాకు, ఒకే సంపద శ్రేణిపై అధికంగా ఆధారపడటం, లక్ష్యం లేని ప్రణాళిక లక్ష్యం లేని పెట్టుబడి అనేవి ఆర్థిక క్రమశిక్షనారాహిత్యాన్ని పెంచుతాయని చెప్పారు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ ఐ పీ) అనేది కేవలం ఒక ఆర్థిక సాధనం మాత్రమే కాదు, అది ఒక క్రమశిక్షణతో కూడుకున్న అలవాటు. మార్కెట్ ఒడిదొడుకులతో సంబంధం లేకుండా, రూపాయి-ఖర్చు సగటు నుంచి ప్రయోజనం పొందుతూ మీరు స్థిర మొత్తాన్ని క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడానికి సిప్ వెసులుబాటు కల్పిస్తాయన్నారు. కాలక్రమంలో ఈ ఆటోమేటెడ్ పెట్టుబడి వ్యూహం మార్కెట్లో పెట్టుబడి పెట్టేలా మీకు తోడ్పాటు అందిస్తూ మీ లక్ష్యాల కోసం సంపద పెంచుకునేందుకు సాయపడుతుందన్నారు.

ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్)గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్)గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. సౌమిత్రకి ఇండియన్ ఆయిల్‌లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఐఐటీ రూర్కీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు. ముంబైలోని ఎస్‌పీ జైన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ పట్టా పొందారు. ఎల్‌పీజీ వ్యాపార విభాగంలో నాలుగేళ్లు పని చేసిన తర్వాత సేల్స్ విభాగంలో పలు కీలక పదవులు నిర్వహించారు. ఈ సమయంలో వ్యాపార విస్తరణలో కీలకంగా మారారు. ఎగ్జిక్యూటివ్‌గా దిగువ స్థాయి ఆపరేషన్స్, మార్కెటింగ్, స్ట్రాటజీ రంగాలలో విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. వ్యాపార వృద్ధి, లాభదాయకత, వినియోగదారుల సంతృప్తి వంటి అంశాలలో మంచి రికార్డు ఆయన సొంతం. ఆయన నాయకత్వంలో నాన్ ఫ్యూయల్ కన్వీనియన్స్ స్టోర్స్, ధ్రువ రిటైల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులు విజయవంతంగా అమలయ్యాయి. పలు సాంకేతికత, డిజిటలైజేషన్ ప్రాజెక్టులను కూడా ముందుకు నడిపారు.వరిటైల్ ట్రాన్స్‌ఫార్మేషన్ గ్రూప్ హెడ్‌గా, ఉత్తర, తూర్పు భారతానికి రిటైల్ బిజినెస్ హెడ్‌గా పని చేశారు. కొత్త భాద్యతల్లో ఆయన ఇండియన్ ఆయిల్ మార్కెటింగ్ మౌలిక సదుపాయాలకు వ్యూహాత్మక దిశను అందిస్తూ స్థిరమైన మార్కెట్ లీడర్‌షిప్, వినియోగదారుల సేవలపై దృష్టి సారించనున్నారు.